క్లుప్తంగా

మెరుగైన ఫలితాలు సాధించాలి



మిడ్జిల్: కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని మంగళవారం డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మెనూ ప్రకారం భోజనాలు అందించాలని సూచించారు. విద్యార్థినులు పూర్తిస్థాయిలో త్వరగా వచ్చేవిధంగా కృషిచేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను విద్యార్థినులకు అందజేశారు. అనంతరం విద్యార్థినుల తరగతి గదుల్లో బోధనను పరిశీలించారు. డీఈఓ వెంట ప్రత్యేకాధికారిణి కవిత, సీఆర్పీ నర్సింహులు, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా దేవయ్య



మిడ్జిల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన సంఘం అధ్యక్షుడిగా దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనువాసులను మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు గౌరవాధ్యక్షుడు బుచ్చయ్య తెలిపారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలయ్య, వెంకటయ్య, దానేలు, సుదర్శన్, రమేశ్, రాములు, సుదర్శన్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



నవాబ్‌పేట: మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని తీగలపల్లి, సిద్దోటం, కాకర్లపహాడ్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లను త్వరగా పూర్తి చేస్తే బిల్లులు త్వరగానే వస్తాయని వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిత్యం కొనసాగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కాకర్లపహాడ్‌లో బోర్లను మరమ్మతు చేయించి తాగునీటి సరఫరా చేయించారు. ఆయన వెంట ఏపీఓ జ్యోతి, పంచాయతీ అధికారులు నరేందర్ ఉన్నారు.

బడిలో చేరిన బడిబయటి పిల్లలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని బోయపల్లిలోని ఓ రైస్‌మిల్లులో చిన్నారుల తల్లిదండ్రులు పనిచేస్తుండగా.. ఇద్దరు చిన్నారులు పాఠశాలకు వెళ్లకుండా ఉండడంతో వారిని గుర్తించిన అధికార సిబ్బంది బోయపల్లి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాస్, హెచ్‌ఎం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: మండలంలోని రైతులు కేఎస్‌ఎం సన్నరకం, ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలు, ఎన్‌టీయూ 10–10 వరి విత్తనాలు గార్లపహాడ్ సొసైటీలో అందుబాటులో ఉన్నాయని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు ప్రైవేటు షాపులలో నకిలీ విత్తనాలు విక్రయించి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

బైక్‌లకు ప్లగ్‌లు కత్తిరించి మేకలతో పరారీ

మిడ్జిల్: మండలంలో మున్ననూర్‌లో ఇంటి తలుపులకు గడె, చుట్టుపక్కల వారి బైక్‌లకు ప్లగ్‌లు కత్తిరించి దొడ్డిలో ఉంచిన మేకలతో పరారైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు జోగిరాజు తన 9మేకలను రోజువారీగా ఇంటి ఎదుట ఉన్న దొడ్డిలో ఉంచారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులను గడె వేసి బయటకు రాకుండా చేశారు. అనంతరం వారివెంట వచ్చిన వాహనంలో మేకలను తరలిస్తుండగా శబ్దానికి రాజుకు అనుమానం వచ్చి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా.. లాక్ చేయడంతో ఇంట్లో నుంచి అరవగా చుట్టుపక్కలవారు వచ్చేసరికి ఇంటి సమీపంలోని బైకుల ప్లగ్‌లను కత్తిరించి మేకలతో పరారయ్యారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.



బొక్కలోనిపల్లి చౌరస్తాలో..



కోయిల్‌కొండలో ..



దేవరకద్రలో..

రాష్ట్ర చరిత్రలో అరుదైన రికార్డు

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా రైతుభరోసా సంబరాలు



మద్దిగట్లలో వీసీలో సీఎం సందేశాన్ని వింటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి

భూత్పూర్: రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులున్నా 9రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుభరోసాను రైతుల ఖాతాల్లో జమచేయడం రాష్ట్రంలో అరుదైన రికార్డని.. ఈ ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూత్పూర్ చౌరస్తాలో సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి రైతు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశా రు. అనంతరం మండలంలోని మద్దిగట్లలో రైతువేదికలో ఏర్పాటు చేసిన వీసీలో సీఎం సందేశాన్ని కలెక్టర్ విజయేందరబోయితో కలిసి విన్నారు. ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఏవో మురళీధర్, కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డిఆధ్వర్యంలో మండలంలోని బొక్కలోనిపల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు రామచంద్రయ్య, నర్సింహారెడ్డి, గోవింద్‌యాదవ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద రైతు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, భాస్కర్, నీలకంఠం తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి కాంగ్రెస్ పార్టీకి జేజేలు పలికారు. సీఎం, మంత్రి వర్గానికి, ఎమ్మెల్యేకు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి,ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, యాదవ్‌కుమార్ పాల్గొన్నారు.

హన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం పార్టీశ్రేణులు ప్రధాన రహదారిపై టపాసులు పేల్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు రైతువేదికల్లో సీఎం ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీహరి, శెట్టిశేఖర్, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, హేమవర్ధన్‌రెడ్డి, షఫి, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



హన్వాడలో టపాసులు పేలుస్తున్న నాయకులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట రైతువేదికలో మంగళవారం సాయంత్రం జరిగిన రైతుభరోసా సంబరాలకు అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ హాజరయ్యారు. రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఏఓ అనిల్ కుమార్, ఎంపీఓ అనురాధ, ఏఈఓ సురేశ్, కార్యదర్శి మాధవి తదతరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి బస్టాండ్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, అప్పంపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతయ్య, ప్రశాంత్‌రెడ్డి, దుర్గానాయక్, మొగులయ్య, బసయ్య పాల్గొన్నారు.

ఇంటర్ విద్యతోనే భవిష్యత్

కోయిల్‌కొండ: విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించేది ఇంటర్ విద్య అని ఎస్‌ఐ తిరుపాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తలరాతను మార్చే దశ ఇంటర్ విద్యకు ఉంటుందని.. కావున చెడు అలవాట్లకు పోకుండా చదవుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల్‌నారాయణ, అధ్యాపకులు విజయ్‌కుమార్, అరవింద్, చంద్రమౌళి, రవికుమార్, రజిత, ప్రవళిక, శ్రీలత, పారిజాతమ్మ, ఖాజాబేగం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'పది' టాపర్లకు ఘనసన్మానం



కోయిల్‌కొండ: మండలంలోని చంద్రాస్‌పల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మాజీ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్సై తిరుపాజీ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మలాదేవి, నాయకులు బచ్చిరెడ్డి, కృష్ణయ్య, వెంకటయ్య, గోపాల్ పాల్గొన్నారు.

పర్సు అందజేత

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ నుంచి వనపర్తికి ఆర్టీసీ బస్సులో వెళ్తూ మార్గమధ్యంలో మంగళవారం జడ్చర్ల బస్టాండ్‌లో దిగిన ప్రయాణికురాలు దాసర్ల పద్మ పర్సును పోగొట్టుకుంది. స్నాక్స్ తీసుకుని దుకాణదారుడికి డబ్బు ఇచ్చేందుకు పర్సు తీయబోయింది. పర్సు లేకపోవడంతో హైరానా పడుతూ ఆర్టీసీ ఎస్‌ఎం యాదగిరికి ఫిర్యాదు చేసింది. ఎస్‌ఎం, ట్రాఫిక్‌గైడ్ శివరాములు, వెంకటయ్య, సెక్యూరిటీ నర్సింహులు బస్టాండ్‌లో పర్సును వెతికి పద్మకు అందజేశారు. పర్సులో రూ.10వేల నగదు ఉన్నాయి. పర్సును ఇచ్చిన అనంతరం మరో బస్సులో వనపర్తికి పంపించారు.



జర్నలిస్టుల పక్షాన పోరాటం చేస్తా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేద జర్నలిస్టులకు, పేదలకిచ్చిన డబుల్ బెడ్‌రూం జోలికి అధికారులు, పాలకులు వెళ్లవద్దని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్ట్ నాయకులు చేస్తున్న రిలే దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. పట్టాలు ఇచ్చినా ఇళ్ల తాళాలు ఇవ్వడం లేదని అన్నారు. ఖాళీగా ఇళ్లు ఉన్నా ఇవ్వడం లేదని, ఎన్నికల కోడ్ రావడంతో గతంలో తాళాలు ఇవ్వలేకపోయామని చెప్పారు. దివిటిపల్లి, వీరన్నపేట వద్ద డబుల్ బెడ్‌రూంలు కడుతుంటే గతంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని తెలిపారు. వెంటనే పేదలకు, జర్నలిస్టులకు ఇళ్ల తాళాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు దిగి వచ్చే వరకు జర్నలిస్టుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీనివాస్‌గౌడ్ హయాంలో వేల డబుల్ బెడ్‌రూంల నిర్మాణంతో నాలుగు చిన్న నగరాలను సృష్టించారని తెలిపారు. గతంలో జర్నలిస్టులకు డబుల్ బెడ్రూమ్ ఇచ్చినా ఇప్పటికీ తాళాలు ఇవ్వడం లేదని చెప్పారు. దీక్షలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇష్టారాజ్యం

- సిబ్బంది, విద్యార్థులపై దురుసు ప్రవర్తన
- వివాదాస్పదంగా మారిన వ్యవహార శైలి
- వివరణకు వెళ్లిన మీడియా సభ్యులపై వాగ్వాదం

దేవరకద్ర రూరల్: దేవరకద్రలోని ఎస్‌బీఐ బ్యాంకు దగ్గర ఉన్న గురుకుల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్–2 తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాసర్ బిన్ సలాం తోటి సిబ్బంది, విద్యార్థులు, తల్లితండ్రులపై అనుసరిస్తున్న వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించడంతో విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురై తల్లితండ్రులతో చెప్పుకొని బాధపడగా.., అడిగేందుకు వెళ్లిన విద్యార్థుల తల్లితండ్రులతో మీ పిల్లలు చదువుకు పనికిరారు, ఎలక్ట్రిషియన్, ప్లంబర్, గాలిపంపులు పెట్టించండని చెప్పడంతో తల్లితండ్రులు నిర్ఘాంతపోయినట్లు తెలిసింది. విద్యను బోధించి సరిదిద్దాల్సిన మీరు అలా మాట్లాడటం సరికాదని చెప్పగా.. వారిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేసి, తనకు బ్యాక్‌గ్రౌండ్ ఉందని, ఎమ్మెల్యే, పైఅధికారులకు చెప్పినా ఎవరూ ఏం చేయరని బెదిరింపులకు గురిచేసినట్లు సమాచారం. దీంతో తల్లితండ్రులు సదరు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయంపై వివరణ కోసం మీడియా సభ్యులు పాఠశాల వద్దకు వెళ్లగా.. లోపలికి అనుమతి లేదని, లోపలికి వచ్చిన వారిపై కేసులు నమోదు చేయమని పైఅధికారులు చెప్పారంటూ మీడియా సభ్యులతో వాగ్వాదానికి దిగాడు. మీడియాకు పాఠశాల లోపలికి అనుమతి నిరాకరించడంపై డీఎం డబ్ల్యూఓ శంకరాచారిని వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని ఇప్పటికే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదులు వచ్చాయని, ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నగరపాలక కమిషనర్‌ను కలిసిన నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరపాలక కమిషనర్‌గా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీజే బెనహర్, లక్ష్మణ్‌నాయక్, మునీరొద్దీన్, శాంతయ్య, ప్రశాంత్‌కుమార్, హనుమంతు, అంజాద్‌అలీ, మోహిసిన్, మహబూబ్, పాపారాయుడు, ఎంఐఎం నాయకులు సాదత్‌అలీ, ముస్తాక్ రషీద్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రమేశ్‌కుమార్, కుర్వ రాములు, అంజయ్య, చెన్నవీరయ్య, రాజేందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, లక్ష్మీనారాయణ, వీరన్న తదితరులు కలిసి సన్మానించారు.

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. నగరపాలక సంస్థ పరిధిలోని దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. మురికివాడల్లో నివసించే దళితులకు ఇంటి, కొళాయి పన్నుల్లో మినహాయింపు ఇవ్వాలని మల్లెపోగు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు నరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్త కమిషనర్‌ను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఎట్టకేలకు ఎంపీహెచ్‌ఓ బదిలీ



ఎంపీహెచ్‌ఓను సన్మానిస్తున్న మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది

నవాబ్‌పేట: మండలంలో గతంలో విధులు నిర్వహించిన ఎంపీహెచ్‌ఓ భద్రునాయక్ ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఆయన గతంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న తరుణంలో ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రకాల ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతోపాటు పారిశుద్యానికి సంబంధించి వస్తువుల కొనుగోలు, శానిటేషన్ తదితర వాటి విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఎంపీహెచ్‌ఓపై గతేడాది ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై చాలాకాలంగా విచారణలు ఎదుర్కొని ఇక్కడే కొనసాగుతూ వచ్చారు. అకస్మాత్తుగా కలెక్టర్ మంగళవారం ఆయనను కోయిల్‌కొండ మండలానికి బదిలీ చేయడం చర్చనీయంశంగా మారింది.

ఎంపీహెచ్‌ఓగా నసీర్‌అహ్మద్

మండలంలో విధులు నిర్వహించి బదిలీ అయిన భద్రునాయక్ స్థానంలో కోయిల్‌కొండ మండలంలో విధులు నిర్వహించిన నసీర్‌అహ్మద్ నవాబ్‌పేటకు బదిలీపై వచ్చారు. దీంతో ఆయన మంగళవారం ఎంపీడీఓ జయరాంనాయక్ సమక్షంలో విధుల్లో చేరారు. ఆయనకు మండల అధికారులు స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన భద్రునాయక్‌ను మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు.

27న జడ్చర్లకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా ఈనెల 27న జడ్చర్ల మండలంలో పర్యటించనున్నట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన పురస్కరించుకుని బడిబాట నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు వంటపాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డీఆర్పీ జగదీశ్వర్‌రెడ్డి ప్రస్తుతం మూడు వారాలపాటు నిర్వహిస్తున్న సంసిద్ధత కార్యక్రమం, ఎఫ్‌ఎల్‌ఎన్ అంశాల గురించి వివరించారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా



పెద్దరాజమూర్ వాగు నుంచి అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న టిప్పర్

దేవరకద్ర: మండలంలోని పెద్దరాజమూర్ సమీపంలోని కోయిల్‌సాగర్ వాగు నుంచి అర్ధరాత్రి టిప్పర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. కొంత కాలంగా అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్ తరలించారు.

కొత్తపల్లి శివారులో రెండు టిప్పర్లు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులోని ఇసుక క్వారీ నుంచి మంగళవారం అధిక లోడుతో వెళ్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. అలాగే మంగళవారం సాయంత్రం ఇసుక క్వారీ అనుమతులు రద్దు చేస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని, అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌కు చెందిన పల్లె కుర్మన్న కాలు ఫ్యాక్చర్ కావడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో ఉండి కోలుకుంటున్నాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు. అదేవిధంగా కంటి ఆపరేషన్ చేయించుకున్న మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్‌ను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన పార్వతమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయన్నగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్, యాదయ్య, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అవగాహన ఉండాలి

గండీడ్: రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున రావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటర్ల నమోదులో పొరపాట్లు, తప్పొప్పులు జరగకుండా పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వచ్చేనెల 3న మాస్టర్ ట్రెయినర్లతో శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాసిన్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

జడ్చర్ల టౌన్: జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కావేరమ్మపేటలో డా.మనుప్రియకు సమ్మె నోటీసును అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు కృష్ణ, మహేశ్, విద్యాసాగర్, యాదమ్మ, అలివేలు, శివలీల, అంజమ్మ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పలు కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేశారు. జూలై 9న నిర్వహించే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాయకుడు చంద్రకాంత్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ, సీడబ్ల్యూసీ గోదాం, డీపీఓ, ఏఎల్‌ఓ, అంగన్వాడీ, ఆర్టీసీ కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, శివకుమార్, వెంకటేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత కలిగి ఉండాలి

జడ్చర్ల టౌన్: ప్రతిఒక్కరిలోనూ ఆధ్యాత్మికత కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీలోని 24వవార్డులో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన మొట్టమొదటి చీఫ్ ఆఫ్ ద బ్రహ్మకుమారీస్ జగదాంబ సరస్వతి సంపూర్ణమైన దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతిఒక్కరికీ భగవంతుడి ఆశీర్వాదం ఉండాలని, తోడు, నీడ ఉండాలన్నారు. బ్రహ్మకుమారీస్ చీఫ్ జగదాంబ సరస్వతి చూపిన మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జగదాంబ సరస్వతి చిత్రపటం వద్ద పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, బ్రహ్మకుమారీలు ప్రబ, సుజ్ఞాని, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ఎస్‌ఓ, సీఆర్‌టీల బదిలీ

రాజాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో మూడునెలల క్రితం చోటుచేసుకున్న కారణాలతో ఇన్‌చార్జి ఎస్‌ఓకు విద్యాశాఖ అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే చివరికి మంగళవారం కేజీబీవీ ఎస్‌ఓ పావనిని బాలానగర్ కేజీబీవీకి బదిలీ చేస్తున్నట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. పీఈటీ రాధికను అడ్డాకుల కేజీబీవీ, సీఆర్‌టీలు స్వాతిని నవాబ్‌పేట, కృష్ణవేనిని బాలానగర్, ఆయేషాబేగంను భూత్పూర్, వాణిని హన్వాడ, జ్యోతిని జడ్చర్ల కేజీబీవీలకు బదిలీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం బుధవారం కేజీబీవీల్లో ఎస్‌ఓతోపాటు సీఆర్‌టీలు విధుల్లో చేరనున్నట్లు ఎంఈవో సుధాకర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 33వ వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారికి ప్రాతకాల పూజలు, మంత్రజపం, చంద్రమౌళీశ్వరస్వామికి విశేష బిల్వార్చన నిర్వహించారు. వాగ్దేవి సంగీత పాఠశాల విద్యార్థుల సంకీర్తనా కచేరీ అలరించింది. తిరుపతికి చెందిన కేపీ శ్రీకరి చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. శేష వాహనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. గోవిందనామంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యాన్ని చాటింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షులు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, శ్రీచంద్రశేఖర వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ అందజేత

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటయిన జూనియర్ కళాశాలకు కావాల్సిన ఫర్నీచర్‌ను ఎస్‌ఆర్‌ఐ అందజేశారు. మంగళవారం ఈకేఏఎం యూఎస్‌ఏవారి దాతృత్వంతో స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీవ్యాల్ ఉయ్యూరి చేతులమీదుగా కళాశాలకు కావాల్సిన 100 డ్యూయల్ డెస్కులను అందజేశారు. అనంతరం షష్ట్యాబ్ది స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీవ్యాల్, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిని సన్మానించారు.

దాడులను ఖండించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఇరాన్‌పై అమెరికా ఏకపక్ష దాడులను ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.